సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 10 । జనవరి । 2023



ప్రజాదివస్‌కు పది ఫిర్యాదులు

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీస్ ఆఫీస్‌లో సోమవారం ప్రజాదివస్‌లో పది ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు.



వేదపాఠశాల సందర్శన

గంభీరావుపేట(సిరిసిల్ల): లింగన్నపేటలోని శ్రీభారతీతీర్థ వేదపాఠశాలను శృంగేరి పీఠం సీఈవో గౌరీశంకర్‌శర్మ సోమవారం సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
28.0/11.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. ఈదురుగాలులు తీవ్ర వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

టీఎస్ యూజీసెట్ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లకల్చరల్: సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. సంబంధిత పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతి ఆవిష్కరించారు. వచ్చే విద్యాసంవత్సరం (2023–24) డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు విధిగా ప్రవేశపరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. టీజీయూజీసెట్ 2024 కోసం ప్రస్తుతం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. తుది గడువుగా ఫిబ్రవరి 5వ తేదీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వివరాలకు www.tswreis.a.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కోఆర్డినేటర్ జాక్లిన్, ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మహాజాతరకు ఏర్పాట్లు షురూ



పందిళ్లు వేస్తున్న కూలీలు

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆలయ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి ఉత్సవాలకు రాజన్న ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు రంగులు వేస్తున్నారు. ఆలయ ఆవరణలో పందిళ్లు వేస్తున్నారు. గుడి చెరువు ఖాళీ స్థలంలో తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

రేపటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు



సిద్ధమైన వేదిక

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు సోమవారం వేదికను సిద్ధం చేశారు. ఐదు రోజులపాటు జరిగే సంగీత, నృత్య, నాటకోత్సవాలతో రాజన్న సన్నిధానం ఓళలాడనుంది. కళాకారులకు వసతి, భోజనం కల్పించేందుకు ఇన్‌చార్జీలను నియమించారు. ప్రారంభం, ముగింపు ఉత్సవాలకు మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు, ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, ఎల్.రమణ, జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావులను ఆహ్వానించినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు.

పురస్కారం అందుకున్న 'పెద్దింటి'



హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారాన్ని అందుకుంటున్న పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్ల: జిల్లాకు చెందిన ప్రముఖ కథకుడు, నవలా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'గుండెలో వాన' కథాసంపుటికి హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం రాత్రి పురస్కారం అందుకున్నారు. పీచర సునీతారావు స్మారక సాహిత్య పురస్కారానికి అశోక్‌కుమార్ రాసిన 'గుండెలో వాన' కథా సంపుటి ఎంపికైంది. రవీంద్రభారతి మినీహాల్‌లో కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, మేడ్చల్ అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, కవి, విమర్శకులు అమ్మంగి వేణుగోపాల్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. గతంలోనూ 'గుండెలో వాన' కథల పుస్తకానికి ఆంధ్ర సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారంతోపాటు మరో రెండు పురస్కారాలను పెద్దింటి అశోక్‌కుమార్ అందుకున్నారు.

ఇలాగైతే తినేదెలా..?



ఈచిత్రంలో అపరిశుభ్ర పరిసరాలు తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట ప్రభుత్వ పాఠశాలలోనివి. ఈ ట్యాంక్ నుంచి వచ్చే నీటితోనే మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు. ఈ పాఠశాలలోని కిచెన్‌షెడ్ శిథిలావస్థకు చేరింది. రేకులు ఊడిపోయే పరిస్థితిలో ఉన్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న సంప్.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలోనిది. దీనిని ఇటీవల నిర్మించగా.. దానిలో నింపిన నీటితోనే వంట చేయడంతో ఇటీవల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

- అపరిశుభ్ర పరిస్థితుల్లో వంట తయారీ
- కలుషితనీటి వినియోగంతో అస్వస్థత
- పురుగుల అన్నం పెడుతున్నారని రోడ్డెక్కిన విద్యార్థులు
- సౌకర్యాలు లేవంటున్న కార్మికులు
- పర్యవేక్షణ లేక అధ్వానంగా నిర్వహణ

సిరిసిల్లఎడ్యుకేషన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నాచుపట్టిన పరిసరాలు.. బోరునీరు.. శిథిలావస్థకు చేరిన కిచెన్‌షెడ్లు.. ఆరుబయటే వంటలు ఇదీ రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మధ్యాహ్న భోజనం అమలు. అపరిశుభ్ర వాతావరణంలో క్లోరినేషన్ చేయని నీటితోనే మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్నారు. ఆరు నెలల క్రితం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పెద్దూరులోని ప్రభుత్వ గురుకులంలో విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. తాజాగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో కలుషిత నీటితో చేసిన వంటను తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ విధానం, ఎలాంటి పరిస్థితుల్లో వంట చేస్తున్నారనే విషయంపై 'సాక్షి' విజిట్ చేసింది.



వంట చేస్తున్న కార్మికులు

మూడు రోజుల్లో రెండు సంఘటనలు

- ఎల్లారెడ్డిపేట మండలంలోనే మూడు రోజుల్లో రెండు సంఘటనలు చోటుచేసుకున్నాయి.
- రాచర్ల గొల్లపల్లిలో కలుషితమైన ఆహారం తిని 29 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన మరువక ముందే.. పురుగుల అన్నం.. నీళ్ల చారు పెడుతున్నారని దుమాల ఏకలవ్య గిరిజన గురుకులం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆదివారం తెల్లవారుజామున రోడ్డెక్కారు.
- రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా నిర్మించిన సంపులో నీటిని నింపి వాడడంతోనే విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ వెల్లడించారు. ఈ సంఘటన నుంచి తేరుకోక ముందే దుమాల ఏకలవ్య గిరిజన గురుకులం పాఠశాలలో పురుగులు, వానపాములతో కూడిన నీళ్ల చారు పెడుతున్నారని ఆదివారం రోడ్డెక్కారు. తమ వేధింపులను తెలిపేందుకు చీకటిలో దాదాపు కిలోమీటర్ నడిచివచ్చారు.

పర్యవేక్షణ లేకనే..

- ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. పారిశుధ్య నిర్వహణ, మధ్యాహ్న భోజనం, తాగునీరు, విద్య, మౌలిక వసతులపై పర్యవేక్షణ లేదు. మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించేందుకు అధికారులు లేరు.
- మధ్యాహ్నం భోజన పర్యవేక్షణ విధుల నుంచి తమను తప్పించాలని హెచ్‌ఎంలు ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.
- విద్యాబోధనను పర్యవేక్షించేందుకు ఐదు మండలాలకు ఒక విద్యాధికారిని ఇన్‌చార్జీలుగా ఉండడంతో ఎంఈవోల పర్యవేక్షణ అంతంతే ఉంటుంది.
- జిల్లా విద్యాధికారి రోజుకు ఏదో ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్నప్పటికీ పెద్దగా ప్రభావం చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.
- ఉపాధ్యాయులను నమ్మి వసతిగృహాలలో బాలికలను ఉంచుతున్న తల్లిదండ్రులకు అయోమయ పరిస్థితులు ఎదురవుతున్నాయి. వరుసగా జరుగుతున్న సంఘటనలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం మన ఊరు–మన బడి ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా అవి బడుగు, బలహీనవర్గాల పిల్లలకు అందకుండా పోతున్నాయి. కనీసం నాణ్యమైన భోజనం అందించకపోవడం బాధాకరం. వంట చేసేందుకు మిషన్ భగీరథ నీటితోపాటు స్థానికంగా ఉన్న బోర్‌వాటర్‌ను వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ పైపులు పగిలిపోయిన ప్రాంతంలో కలుషితనీరు సరఫరా అవుతున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో గ్రామపంచాయతీ ట్యాంకునీటిని వినియోగిస్తున్నారు. విద్యార్థులు తాగేందుకు ఈ నీటినే వాడుతున్నట్లు తెలిసింది. కొన్ని పాఠశాలల్లో ప్యూరిఫైడ్ వాటర్ తెచ్చినా క్యాన్‌లలో నాచు కనిపిస్తుంది.

కడుపునొప్పి వచ్చింది



మధ్యాహ్న భోజనం తిన్న రెండు గంటలకు కడుపునొప్పి వచ్చింది. నొప్పి బాధ తగ్గకపోవడంతో సార్లకు చెప్పిన. నాలాగే మరికొందరికి ఇదే పరిస్థితి ఏర్పడింది. పాఠశాలకు మండలం నుంచి పెద్దసార్లు వచ్చి మమ్ములను సిరిసిల్ల ఆస్పత్రికి తీసుకుపోయారు. మధ్యాహ్న భోజనం తినాలంటే భయంగా ఉంది. – ఇరుముళ్ల శ్రావణి, విద్యార్థి

సమస్యలు పరిష్కరిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరిస్తాం. మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ పెంచుతాం. గొల్లపల్లిలో కలుషితమైన నీటితో వంట చేయడంతోనే ఈ సమస్య వచ్చింది. నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపాం. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం. మంచినీరు అందించేందుకు ఉన్నతాధికారులకు విన్నవించి తగు చర్యలు తీసుకుంటాం.
– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి, సిరిసిల్ల

జిల్లా సమాచారం	
పాఠశాలలు	478
విద్యార్థులు	41,328
మధ్యాహ్న భోజన ఏజెన్సీలు	478
భోజన కార్మికులు	863
నీటి సరఫరా ఉన్న పాఠశాలలు	478
కిచెన్‌షెడ్లు ఉన్న పాఠశాలలు	353
నిర్మాణంలో ఉన్నవి	27
కిచెన్‌షెడ్స్ లేనివి	98

నేడు మంత్రి కేటీఆర్ పర్యటన

- 'సెస్' పాలకవర్గం ప్రమాణ స్వీకారం



సిరిసిల్ల: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు మంగళవారం జిల్లాలో పర్యటిస్తారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు తంగళ్లపల్లి మండల కేంద్రంలో కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, 11 గంటలకు తంగళ్లపల్లి మండల పరిషత్ నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. 11.30 గంటలకు 'సెస్' ఆఫీస్‌లో పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరవుతారు. 12.30 గంటలకు పద్మనాయక కల్యాణ మండపంలో రైతు కృతజ్ఞత సభకు హాజరైన భోజనంలో పాల్గొంటారు. జిల్లాలోని బోయినపల్లి మండలం కొదురుపాకలో మంత్రి కేటీఆర్ అమ్మమ్మ ఊరిలో స్కూల్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌ను పరామర్శించేందుకు మంత్రి కేటీఆర్ వెళ్లనున్నారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ పర్యటన షెడ్యూల్‌ను బీఆర్‌ఎస్ పార్టీ నేతలు వెల్లడించారు.

నేడు కొదురుపాక పాఠశాల భవనానికి భూమిపూజ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకలో మంగళవారం రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. కేటీఆర్ అమ్మమ్మ తాతయ్యలు జోగినిపల్లి లక్ష్మీకేశవరావుల జ్ఞాపకార్థం కొదురుపాకలో నిర్మించే ప్రైమరీ పాఠశాల భవనానికి భూమి పూజ చేయనున్నారు. సుమారు రూ.కోటి అంచనాలతో స్కూల్ భవనం నిర్మించనున్నారు. భవన భూమిపూజకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎస్సై అభిలాశ్, కొనుకటి లచ్చిరెడ్డి ఉన్నారు.

18 నుంచి రెండో విడత కంటి వెలుగు

- జిల్లాలో 6,19,530 మందికి కంటి పరీక్షలు
- 26 బృందాలతో శిబిరాలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఈనెల 18 నుంచి వంద రోజులపాటు రెండోవిడత 'కంటి వెలుగు'ను చేపడుతున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం 'కంటివెలుగు'పై సమీక్షించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు 255 గ్రామాల్లోనూ కంటివెలుగు పరీక్షలను 6,19,530 మందికి నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం 26 వైద్యబృందాలను ఏర్పాటు చేశామని, మరో రెండు అదనపు బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి 100 ఏళ్ల వృద్ధుల వరకు అన్ని వయసుల వారికి కంటిపరీక్షలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కంటివెలుగు శిబిరాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి మండలానికి రెండు, మూడు బృందాలు క్షేత్రస్థాయిలో ఉండి పరీక్షలు చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో కంటివెలుగు శిబిరాల లేఅవుట్‌ను వివరించారు. ఐదు కౌంటర్లు ఉంటాయని తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇస్తారని, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి తరువాత చేయిస్తామని సుమన్‌మోహన్‌రావు వివరించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవో పవన్‌కుమార్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- ఈఎంఆర్‌ఎస్ ఓఎస్‌డీ చంద్రశేఖర్
- దుమాల గురుకులంలో విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకన్న

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థినులు అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని ఏకలవ్య మోడల్ గురుకులం పాఠశాలల ఓఎస్‌డీ చంద్రశేఖర్ భరోసానిచ్చారు. విద్యార్థినులు చదువుపైనే దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థినుల ఆందోళన నేపథ్యంలో మండలంలోని దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతోనే ప్రత్యేకంగా సమావేశమై.. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులు, కాస్మోటిక్స్ పంపిణీపై సుదీర్ఘంగా మాట్లాడారు. భోజనం మెనూ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనిదినాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు తాజా కూరగాయాలతో నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, వాచ్‌మెన్‌లను విధుల నుంచి తొలగించామని, విచారణ నివేదికను సొసైటీ కార్యదర్శి రోనాల్డ్‌రాస్‌కు అందజేస్తామని తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్ వెంకన్న, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామారావు ఉన్నారు.

కొత్త కూలి ఒప్పందం చేపట్టాలి

- కలెక్టరేట్ ముందు సైజింగ్ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సైజింగ్ కార్మికులు

సిరిసిల్లటౌన్: సైజింగ్ యజమానులతో కొత్త కూలి ఒప్పందం జరిపించాలని జిల్లా సైజింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వొల్లాల కిశోర్ డిమాండ్ చేశారు. 17 రోజులుగా కూలి పెంపు కోరుతూ నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సైజింగ్ కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. తిరుపతి, రాజు, యాదగిరి, పర్శరాములు, దేవవ్వ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మొక్కులు అందుకో రాజన్న



వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, తడిబట్టలతో కోడెమొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణం మొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనాలు, భీమన్న, నగరేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు.



సహకార వెలుగులు విరజిమ్మేనా..!

- సెస్‌పై రూ.210 కోట్ల బకాయిల భారం
- సమర్థ సేవలతోనే సంస్థకు మనుగడ
- నేడు కొలువుదీనున్న నూతన పాలకవర్గం
- ప్రమాణ స్వీకారానికి మంత్రి కేటీఆర్ హాజరు



సిరిసిల్ల 'సెస్' ప్రధాన ఆఫీస్ భవనం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో విద్యుత్ సరఫరా చేసే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) ఈ ప్రాంతంలోని గృహాల్లోకి కరెంట్ బల్బులు తీసుకొచ్చింది. గుడ్డిదీపాలు పెట్టుకున్న ఈ ప్రాంత ప్రజలకు కరెంట్‌బల్బును పరిచయం చేసింది. చేనేత మగ్గాలకు కరెంట్ మోటారై అండగా నిలిచింది. ఒకప్పటి సిరిసిల్ల, వేములవాడ పాత తాలూకాల పరిధిలో.. ఇప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్థికాభివృద్ధికి బాటలు వేసింది. దేశంలోనే సహకార రంగంలో విద్యుత్‌ను పంపిణీ చేసే ప్రతిష్ఠాత్మకమైన సంస్థగా గుర్తింపు పొందింది. అనేక దేశాల విద్యుత్‌రంగ నిపుణులు 'సెస్'పై అధ్యయనం చేశారు. కొత్త పాలకవర్గం మంగళవారం కొలువుదీరనుంది. లాభాపేక్ష లేకుండా ఐదు దశాబ్దాలుగా విద్యుత్ పంపిణీ చేస్తున్న 'సెస్' సంస్థ చీకటి వెలుగులపై కథనం.

సిరిసిల్ల 'సెస్' ప్రత్యేకత ఏమిటి ?

కేంద్ర గ్రామీణ విద్యుదీకరణ సంస్థ(ఆర్‌ఈసీ) దేశవ్యాప్తంగా ఐదు గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలను స్థాపించగా.. సిరిసిల్ల 'సెస్' ఒక్కటి. కాలక్రమంలో అన్ని సంస్థలు ఉనికి కోల్పోగా సిరిసిల్ల సంస్థ ఉత్తమ సేవలతో ముందుకెళ్తోంది. వినియోగదారులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తూ.. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లో మరమ్మతు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 2007 నాటి వరకు 'సెస్' పరిధిలో వినియోగదారులే స్వచ్ఛందంగా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు శ్రమదానం చేసేవారు. ఇప్పుడు కాంట్రాక్టు వ్యవస్థ మొదలైంది.

సంస్థ ముందున్న సవాళ్లు ఇవీ..

- 'సెస్'కు ఇప్పుడు పరికరాలను భద్రపరుచుకునే స్టోర్స్ లేదు. సిరిసిల్లలోని మానేరు తీరంలోని స్థలాన్ని రైతుబజారుకు కేటాయించడంతో ఇప్పుడు అద్దె భవనంలో కొనసాగుతోంది.
- గతంలో పనిచేసిన పాలకవర్గాలు అవినీతికి పాల్పడడం, కాంట్రాక్టర్లుగా మారడం, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు నుంచి సిబ్బంది పదోన్నతుల వరకు అన్నింటా అవినీతికి పాల్పడ్డారు.
- క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు ఇవ్వనిదే ఏ పని చేయడం లేదు.
- 'సెస్'లో చాలా మంది ప్రతిభ ఆధారంగా కాకుండా కారుణ్య నియామకాల ద్వారా చేరారు. మరికొందరు పాలకవర్గానికి డబ్బులు ఇచ్చి నియమితులయ్యారు. దశాబ్దాల తరబడి ఒకే చోట పాతుకుపోవడంతో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు.
- 'సెస్' ప్రారంభంలో 1.20 లక్షల కనెక్షన్‌లు ఉన్న కాలంలో 425 సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం విద్యుత్ సర్వీసులు 2.80 లక్షలకు చేరినా.. సిబ్బంది 355 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న సిబ్బందితో పకడ్బందీగా పనిచేయించే అజమాయిషీ వ్యవస్థ లేదు.

'సెస్' సంస్థ సమగ్ర స్వరూపం	
స్థాపితం	1970 నవంబరు 1
విద్యుత్ కనెక్షన్‌లు	2,80,106
ఉద్యోగులు	355
వ్యవసాయ కనెక్షన్‌లు	78,570
మరమగ్గాల కనెక్షన్‌లు	8,265
గృహవిద్యుత్ కనెక్షన్‌లు	1,59,928
పరిశ్రమలు	1,557
దుకాణాలు	13,138
ఇతర కనెక్షన్‌లు	18,648

విద్యుత్ సబ్‌స్టేషన్లు	44
నెలకు విద్యుత్ కొనుగోలు	రూ.45 కోట్లు
నెలకు బిల్లుల వసూలు	రూ.10.50 కోట్లు
ప్రభుత్వం చెల్లించే రాయితీలు	రూ.23.50 కోట్లు
నెలవారీగా సిబ్బంది జీతాలు	రూ.2 కోట్లు
'సెస్' ఆస్తులు	రూ.125 కోట్లు
విద్యుత్ బకాయిలు	రూ.210 కోట్లు

మంత్రి కేటీఆర్‌పైనే ఆశలు

సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావుపైనే 'సెస్' సంస్థ మనుగడ ఆధారపడి ఉంది. సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు మంజూరు చేస్తే ఆర్థికంగా బలపడుతుంది. కొత్తగా ఎన్నికైన పాలకవర్గం సంస్థ పనితీరుపై నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. గతంలో అవినీతి మరకలు అంటించుకున్న పాలకవర్గాలను గాడిలో పెట్టి సంస్థ పరువును నిలపాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉంది. ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే భావం పోయేలా తప్పు చేసిన వారిపై చర్యలు ఉండాలి. ×సెస్‌៖ పరిధిలో సౌరవిద్యుత్ ఉత్పత్తికి ఊతమిచ్చేందుకు రైతులను ప్రోత్సహించాలి. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కొత్త పాలకవర్గం కృషి చేయాల్సిన అవసరం ఉంది. సభ్యుల సహకారంతో 'సెస్' సంస్థ పూర్వవైభవంతో నాణ్యమైన విద్యుత్ పంపిణీతో ముందుకు సాగుతుందని ఆశిద్దాం.

క్లుప్తంగా

గురుకుల ప్రిన్సిపాల్‌పై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేసిన మండలంలోని దుమాల ఏకలవ్య గురుకుల బాలిక ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మిపై విచారణ చేపట్టాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోవడం, కాస్మోటిక్స్ చార్జీలు పక్కదారి పట్టించడంపై విచారణ చేపట్టాలని కోరారు. విద్యార్థినులపై దురుసుగా ప్రవర్తించిన వార్డెన్, వాచ్‌మెన్, వంటమనిషిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు రాజునాయక్, దేవయ్య, రాములు, బాబు ఉన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగించండి

- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దుమాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్, ఫుడ్ ఏజెన్సీ నిర్వాహకులను ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల పరిశీలనకు సోమవారం వచ్చిన గురుకులాల ఓఎస్డీ చంద్రశేఖర్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, కాస్మోటిక్స్ చార్జీలు సైతం సరిపోవడం లేదని, పెంచాలని కోరారు. మెస్ ఏజెన్సీలో అక్రమాలు జరుగుతున్నాయని, దానిపై విచారణ చేపట్టాలని కోరారు. సన్నబియ్యం పెడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ గురుకులాల్లో దొడ్డుబియ్యమే పెడుతున్నారన్నారు. దుమాల ఏకలవ్య గురుకులంలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టి బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొప్పు నవీన్‌రెడ్డి, కాశర్ల రాకేశ్, పెండ్యాల శివారెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం



రజత పతకం అందుకుంటున్న రత్నాకర్

గంభీరావుపేట(సిరిసిల్ల): జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన రత్నాకర్ రజత పతకం అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మధురనగరంలో ఇండియన్ కౌన్సిల్‌ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 17వ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించిన రత్నాకర్‌ను గ్రామస్తులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రజావాణిలో 26 దరఖాస్తుల స్వీకరణ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. వివిధ సమస్యలపై 26 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పవన్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

– వేములవాడలోని బెగ్గర్‌హోమ్ చాలా రోజులుగా మూసి ఉందని, దానిని తెరిపించాలని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమాలకర్ కోరారు. బెగ్గర్‌హోమ్‌ను అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించాలని విన్నవించారు.

బెల్టుషాపులు తొలగించండి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్ల పట్టణంలోని కార్మికవాడలైన వీవైనగర్, సుందరయ్యనగర్, గణేశ్‌నగర్‌లలో జనావాసాల మధ్య బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. జనావా సాల మధ్య బెల్టుషాపులు ఉండడంతో నిరుపేద కార్మికులు మద్యానికి బానిసలవుతున్నారు. మద్యంమత్తులో తరచూ గొడవలకు దిగుతున్నారు. చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఙబెల్టుషాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

– సీపీఐ నాయకులు పంతం రవి, మంత్రి చంద్రయ్య, అజ్జ వేణు, మల్లేశం

బాధతో వచ్చి.. సంతోషంతో వెళ్లాడు



కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన మారుపాక సత్తయ్య బ్యాటరీ ట్రైసైకిల్ కోసం ప్రజావాణికి వచ్చాడు. చాలాసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని బాధతో హాల్‌లోనికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న సిబ్బంది వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి కలెక్టర్‌ని కలవడానికి పంపించారు. ఇది గమనించిన కలెక్టర్ దివ్యాంగుడి దగ్గరకు వచ్చారు. తనకు బ్యాటరీ సైకిల్ మంజూరు చేయాలని సత్తయ్య కలెక్టర్‌ను వేడుకున్నాడు. స్పందించిన కలెక్టర్ వెంటనే అక్కడే ఉన్న సంబంధిత అధికారులతో మాట్లాడి బ్యాటరీని సైకిల్‌ని అందజేశారు. అదే విధంగా నారాయణపురం గ్రామానికి చెందిన నాగరాజుకు ట్రైసైకిల్, వినికిడి సమస్యతో బాధపడుతున్న సిరిసిల్లకు చెందిన వెంగళ తిరుపతికి హియరింగ్ మిషన్ అందజేశారు. దివ్యాంగుడు అడిగిన వెంటనే బ్యాటరీ ట్రైసైకిల్ అందజేయడంతో ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. బాధతో వచ్చిన దివ్యాంగుడు సంతోషంగా బ్యాటరీ ట్రైసైకిల్‌పై ఇంటికెళ్లాడు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ అనురాగ్‌జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల్లోని సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మండల ప్రత్యేకాధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ, టాయిలెట్లు, మినరల్ ఆర్వో, వంట సామగ్రి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలన్నారు. గడువు దాటిన వస్తువులను వంటకు వాడొద్దని సూచించారు. ప్రతీ విద్యాసంస్థలో జనహిత హెల్ప్‌లైన్ నంబర్ 93986 84240, janahitharsd@gmai.com ఐడీని నోటీస్‌బోర్డులో ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, డీపీవో రవీందర్, మండల ప్రత్యేకాధికారులు స్వప్న, బుద్ధనాయుడు, కొండల్‌రావు, రణధీర్‌కుమార్, ఉపేందర్‌రావు, శివప్రసాద్, కొమురయ్య, రీజినల్ కోఆర్డినేటర్లు వెంకన్న, జాక్వెలిన్, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

నకిలీ వస్త్రాల దిగుమతిని అరికట్టాలి

- పండుగ వేల టెస్కో ప్రకటనలు ఏవి?
- కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న సర్కారు
- బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేష్



అభివాదం చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి నేతలు

సిరిసిల్లటౌన్: ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న నకిలీ వస్త్రాల ఆర్డర్లను నిలిపివేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పండుగల వేల రాష్ట్రంలో చేనేత, మరమగ్గాల కార్మికులకు పని కల్పించేందుకు టెస్కో ఆర్డర్ల ప్రకటన విడుదల చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రోత్పత్తిలో కార్పొరేట్లకు కొ మ్ముకాస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుతో నే చేనేత, నేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ల్యాండ్, లిక్కర్ మాఫియాలను మించిన రూ.50వేల కోట్ల నకిలీ వస్త్రాల మాఫియా కొనసాగుతోందని ఆరోపించారు. బతుకమ్మ చీరల తయారీకే సిరిసిల్ల నేతన్నలను పరిమితం చేసి విలువైన పట్టుచీరల తయారీని ఆంధ్ర, తమిళనాడు నుంచి దిగుమతి చేయడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సిరిసిల్ల పవర్‌లూమ్స్‌ను అప్‌గ్రేడ్ చేయకుండా వస్త్రాల మాఫియాకు వత్తాసు పలుకుతూ..కోట్లాది రూపాయలు దోచి పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వస్త్రాల మాఫియా, వారికి సహకరిస్తున్న అధికారులు, మంత్రులపై సీఎం కేసీఆర్ చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఇన్సూరెన్స్ వెంటనే అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, సమితి నాయకులు రిక్కుమల్ల మనోజ్‌కుమార్, కుమార్‌గాడ్గే, గోనె ఎల్లప్ప, కొండ ప్రతాప్, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురికి గాయాలు

- ఆస్పత్రికి తరలింపు



గాయపడిన చిన్నారి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఓ బైక్‌ను అతివేగంగా దూసుకొచ్చిన ఆటోట్రాలీ ఢీకొన్న ఘటనలో తండ్రి కూతురు తీవ్రగాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజన్నపేట పరిధి కిష్టునాయక్ తండాకు చెందిన బానోతు లష్కర్(47), కృప (7) ఇద్దరు టీవీఎస్ బైక్‌పై తహసీల్దార్ కార్యాలయంలో వ్యక్తిగత పనులకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఆటోట్రాలీ డ్రైవర్ షేక్‌పాషా అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బైక్ పైనుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. వీరిని వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



అందిస్తున్న వైద్యం



ప్రమాదానికి గురైన బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- స్టీరింగ్ స్టక్ అయి చెట్టుకు ఢీకొట్టిన వైనం
- 18 మంది ప్రయాణికులకు గాయాలు
- ప్రమాద సమయంలో బస్సులో 41 మంది
- సహాయక చర్యల్లో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు
- క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ

మంథని:మంథని–కాటారం ప్రధాన రహదారిపై.. అడవిసోమన్‌పల్లి–నాగేపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో బస్సులో ఉన్న 18 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మరో పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎనిమిది మందికి తల, ఇతర శరీర భాగాలకు గాయాలు కావడంతో వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. మంథని ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మంథని నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్లకు 41 మంది ప్రయాణికులతో బయల్దేరింది. నాగేపల్లి సమీపంలోకి రాగానే బస్సు స్టీరింగ్ స్టక్ కావడంతో అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. డ్రైవర్ గోపాల్ ప్రమాదాన్ని గుర్తించి బ్రేక్‌లు వేయగా.. పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వారిని మంథని సామాజిక వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. గాయపడిన వారంతా జయశంకర్‌భూపాలపల్లి జిల్లా, ఎన్టీపీసీకి చెందినవారు. మల్లారానికి చెందిన రావుల స్వరూప, గాదంపల్లికి చెందిన నల్లాల శారద, చిన్నతూండ్లకు చెందిన సరోజన తలకు బలమైన గాయాలు అయ్యాయి. మల్లారానికి చెందిన దేనవేన అశ్విని పళ్లు విరిగాయి. గాదంపల్లికి చెందిన తిరుపతి ప్రియాంక, ఆమె తల్లి విజయ, రెండు నెలల చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది. క్షతగాత్రులు 18 మందిని సామాజిక ఆసుపత్రికి తీసుకురాగా ఆస్పత్రి ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి మాతా శిశు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులను పిలిపించి వైద్య సేవలు అందించారు.

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం పర్యటనకు వెళ్లి మంథని వస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు మార్గంమధ్యలో ప్రమాదం కనిపించడంతో అక్కడే ఆగి.. క్షతగాత్రుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను తన వాహనాలతోపాటు తన పార్టీ నాయకుల వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సును రప్పించి వారివారి గ్రామాలకు పంపించారు. గాయాలతో వచ్చిన వారికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు. ఎనిమిది మందిని కరీంనగర్‌లోని ఆస్పత్రులకు పంపించారు. మంథని ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పెద్ద ఎత్తున నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండో ఎస్సై రాజివర్మ సామాజిక వైద్యశాలలో సేవలందించారు.

నేడు ఎంపీపీ కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- సాక్షి కథనంతో సొంత భవనానికి మోక్షం

సాక్షి స్పందన



ప్రారంభానికి సిద్ధమవుతున్న ఎంపీడీఓ కార్యాలయ సొంత భవనం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎంపీపీ కార్యాలయం మండలం ఏర్పడినప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. రూ.90 లక్షలు నిధులతో సొంత భవనం నిర్మించి ఏడాది గడుస్తున్నా.. ప్రారంభించకపోవడంపై 'ప్రారంభోత్సవానికి మీనమేషాలు' శీర్షికతో డిసెంబర్ 27న 'సాక్షి' కథనం ప్రచురించింది. సొంత భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ అద్దె భవనంలో కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటని..? ప్రశ్నించింది. 'సాక్షి' కథనానికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి ప్రారంభోత్సవానికి సిద్ధంచేయాలని ఆదేశించడంతో ఏర్పాట్లుచేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయం సొంత భవనాన్ని మంత్రి కేటీఆర్ స్వయంగా ప్రారంభించనున్నారు. ఎంపీడీవో కార్యాలయం అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి మారేందుకు కృషిచేసిన 'సాక్షి' కి మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శ్రీహరి, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): 317 జీవోతో ఏర్పడిన ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ప్రస్తుతం పాఠశాలలో అమలుచేస్తున్న ఎఫ్ఎల్ఎన్ బోధన విధానాన్ని సరళీకృతం చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు మురళీ పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆర్టీసీని పరిరక్షించాలి..
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య
- సిరిసిల్లలో కార్మికుల సంఘర్షయాత్ర



సిరిసిల్లలోని కళాజాతలో మాట్లాడుతున్న వీరయ్య

సిరిసిల్లటౌన్: రవాణరంగం కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రవాణరంగ కార్మికుల సంఘర్ష యాత్రలో భాగంగా సోమవారం సిరిసిల్లకు విచ్చేసి మాట్లాడారు. ఆర్టీసీని పరిరక్షించాలని, కార్మిక యూనియన్లపై పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు రవాణా రంగాల్లో పనిచేస్తున్నారని వారి సంక్షేమానికి యాత్ర చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హులైన కార్మికులు అందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి కూరపాటి రమేశ్, జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, మోర అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పట్టించుకునే వారేరి?



పాఠశాలను పరిశీలిస్తున్న రంజిత్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకునే వారే లేరని, కొన్ని పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నా అందులోనే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నారాయణపూర్, పదిర, రాగట్లపల్లి, అగ్రహారంలోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం సందర్శించి మాట్లాడారు. ప్రస్తుతం పాఠశాలల్లో తలెత్తుతున్న సమస్యలపై అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మంచినీరున, మౌళిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా అధికారులు అన్ని పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నవీన్‌రెడ్డి, రాకేశ్, శివారెడ్డి, రాము, సురేశ్, ప్రవీణ్, నాగరాజు వెంట ఉన్నారు.

తంగళ్లపల్లి పేరుకే మండలం.. అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న బుస్స వేణు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలం ఏర్పడి ఐదేళ్ల గడుస్తున్నా.. అభివృద్ధికి నోచుకోవడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా పోరాట సమితి నాయకుడు బుస్స వేణు ఆరోపించారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ... పేరుకే మండలమని అభివృద్ధి శూన్యమన్నారు. తంగళ్లపల్లి మండలం రద్దుచేసి చుట్టూపక్కల గ్రామాలను సిరిసిల్ల మున్సిపాలిటీలో కలుపుతారని టీఆర్ఎస్ నాయకులే చెబుతున్నారన్నారు. దీంతో సిరిసిల్ల మున్సిపాలిటీలో కలిపిన ఏడు గ్రామాల ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని వారికి ఏడాదికి 150 రోజుల ఉపాధిహామీ పనులు దూరమై అడ్డా కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పరిస్థితి తంగళ్లపల్లి మండల ప్రజలకు కూడా ఏర్పడుతోందని, ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం లంచాలు ఇచ్చే పరిస్థితి నెలకొంటుందన్నారు. పన్నుల భారం ప్రజలపై పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో కలిపే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుస్స వేణు ఉద్యమ నాయకుడు కుసుమ విష్ణు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): 21 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వవిద్యార్థులంతా సోమవారం ఒకే వేదికపై కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ జెడ్పీపాఠశాలలో 2000-01 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన 72 మంది పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఏర్పాటుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. నిక్‌నేమ్‌లతో పిలుచుకుని ఒకరికొకరు అలింగనం చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమవంతుగా పాఠశాల అభివృద్ధికి రూ.25వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకట్‌రమణ, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపిక

ముస్తాబాద్(సిరిసిల్ల): కేంద్రప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరానికి ప్రకటించిన ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కు ముస్తాబాద్ జెడ్పీబాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం విఠల్‌నాయక్ తెలిపారు. విద్యార్థులను భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీ పరీక్షలు నిర్వహించారన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపిక చేశా మన్నారు. ఈ పోటీల్లో సత్తా చాటిన ఏడోతరగతి విద్యార్థి కావటి అక్షయ, ఎనిమిదో తరగతి విద్యార్థి చెక్కపల్లి దీక్షిత ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.